అదానీ ఆడిటర్ల స్క్రూటినీ

ఈవై ఇండియా సంస్థ ఎస్ఆర్ బాట్లిబాయ్‌పై కన్ను

అదానీ కంపెనీల ఆడిట్ ఫైళ్లు ఇవ్వాలంటూ రెగ్యులేటర్ ఆదేశం

ముంబై, అక్టోబర్ 25: అదానీ గ్రూప్‌నకు దీర్ఘకాలంగా ఆడిటర్లుగా వ్యవహరిస్తున్న ఒక సంస్థపై అకౌంటింగ్ రెగ్యులేటర్ నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్ఎఫ్ఆర్ఏ) తాజాగా దృష్టిపెట్టింది. అదానీ కంపెనీలను ఆడిట్ చేసే ఎర్నస్ట్ అండ్ యంగ్ (ఈవై)కు ఇండియా సభ్య సంస్థ ఎస్ఆర్ బాట్లిబాయ్ వ్యవహారాలను ఎన్ఎఫ్ఆర్ఏ స్క్రూటినీ చేస్తున్నదని సంబంధిత వర్గాల్ని ఉటంకిస్తూ ఎకానమిక్ టైమ్స్ బుధవారం ఒక కథనాన్ని వెలువరించింది. ఈ ఆడిటింగ్ సంస్థపై కొద్దివారాల క్రితం దర్యాప్తు ప్రారంభించిందని, కొన్ని అదానీ గ్రూప్ కంపెనీల ఆడిట్స్‌కు సంబంధించిన ఫైళ్లు, కమ్యూనికేషన్లు సమర్పించమంటూ రెగ్యులేటర్ ఆదేశించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. 2014 సంవత్సరం నుంచి ఆడిట్ ఫైళ్లు కోరినట్టు సమాచారం. ఈ అంశంపై ఈవై, ఎస్ఆర్ బాట్లిబాయ్ ప్రతినిధులు వ్యాఖ్యానించేందుకు నిరాకరించగా, ఎన్ఎఫ్ఆర్ఏ, అదానీ గ్రూప్‌లు స్పందన వెల్లడించలేదని ఎకనామిక్ టైమ్స్ పేర్కొంది. అంతర్జాతీయ ఆడిటింగ్ దిగ్గజం ఈవైకు ఎస్ఆర్ బాట్లిబాయ్ ఇండియాలో సభ్య సంస్థగా కొనసాగుతున్నది. విదేశీ అకౌంటింగ్ సంస్థలు భారత్‌లో ఆడిటర్లుగా రిజిష్టర్‌కావడానికి చట్టం అనుమతించదు. అందుచేత ఈవైతో సహా నాలుగు అంతర్జాతీయ ఆడిటింగ్ దిగ్గజాలు ఇక్కడి సభ్య సంస్థల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి.

ఐదు అదానీ కంపెనీలకు ఆడిటర్

ఎస్ఆర్ బాట్లిబాయ్ ఐదు అదానీ లిస్టెడ్ కంపెనీలకు ఆడిటర్‌గా పనిచేస్తున్నది. అదానీ పవర్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ విల్మార్‌లతో పాటు గత ఏడాది హోల్సిమ్ నుంచి అదానీ గ్రూప్ కొనుగోలు చేసిన సిమెంట్ కంపెనీలు అంబుజా సిమెంట్స్, ఏసీసీలకు ఈ సంస్థే గత కొద్ది సంవత్సరాలుగా ఆడిటర్. గత ఏడాది అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ఖాతా పుస్తకాలపై సైతం ఎస్ఆర్ బాట్లిబాయ్ సంతకాలు చేసింది. అదానీ గ్రూప్ అకౌంటింగ్, డిస్‌క్లోజర్లపై ఈ ఏడాది జనవరిలో యూఎస్ హెడ్జ్ ఫండ్ హిండెన్‌బర్గ్ పలు ప్రశ్నలను లేవనెత్తిన నేపథ్యంలో ఎస్ఆర్ బాట్లిబాయ్ ఆడిటింగ్ వ్యవహారాల్ని రెగ్యులేటర్ దర్యాప్తు చేస్తుండటం గమనార్హం. అప్పట్లో హిండెన్‌బర్గ్ ప్రశ్నలకు అదానీ గ్రూప్ స్పందిస్తూ తమ కంపెనీలను సర్టిఫైడ్, క్వాలిఫైడ్ వృత్తినిపుణులు ఆడిట్ చేశారని పేర్కొన్నది. ఆ వృత్తి నిపుణుల ఆడిట్‌పైనే రెగ్యులేటర్ ప్రస్తుతం దృష్టి సారించింది.

ఆడిటర్‌ను మార్చిన అదానీ టోటల్ గ్యాస్

కొద్ది నెలల క్రితం అదానీ టోటల్ గ్యాస్ తన ఆడిటర్‌ను మార్చింది. పలు అదానీ కంపెనీలకు దీర్ఘకాలంగా ఆడిటర్‌గా ఉన్న షా ధన్‌ధారియా అండ్ కో స్థానంలో కొత్త ఆడిటర్‌గా వాకర్ చాందియోక్ అండ్ కో ఎల్ఎల్‌పీని నియమించుకున్నట్టు ఈ ఏడాది మే 2న అదానీ టోటల్ వెల్లడించింది. ఇటువంటి పెద్ద అసైన్‌మెంట్లు చేయడానికి షా ధన్‌ధారియా చాలా చిన్నదంటూ హిండెన్‌బర్గ్ పేర్కొన్న నేపథ్యంలో ఈ మార్పు జరగడం గమనార్హం.

అదానీ పోర్ట్స్ లావాదేవీలపై డెలాయిట్ ఆందోళన

అదానీ పోర్ట్స్ కొన్ని సంస్థలతో జరిపిన లావాదేవీలకు తగిన డాక్యుమెంట్లు ఇవ్వలేదంటూ ఇటీవల డెలాయిట్ హాస్కిన్స్ అండ్ సెల్స్ ఎల్ఎల్‌పీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సంస్థ ఆగస్టులో ఆడిటర్‌గా వైదొలిగింది. కొద్ది సంవత్సరాలుగా అదానీ..గ్రూప్ కంపెనీలనే క్లయింట్లుగా చూపిస్తూ భారీ రుణాలు సేకరిస్తూ విస్తరణ జరుపుతున్న వైనంపై కొంతమంది ఆడిటర్లు జాగ్రత్త వహిస్తున్నట్టు బ్లూంబర్గ్ వార్తా సంస్థ తెలిపింది. అదానీ గ్రూప్ కంపెనీల్లో అదానీ పవర్‌కు దీర్ఘకాలంగా ఆడిటర్‌గా వ్యవహరిస్తున్న ఎస్ఆర్ బాట్లిబాయ్ ఇటీవల పలు అకౌంటింగ్ అంశాల్ని లేవనెత్తింది. ప్రత్యేకించి 2028 నుంచి భారీ నష్టాల్ని చవిచూస్తున్న విద్యుత్ ప్లాంట్ ఓవర్ వేల్యుయేషన్ పట్ల ఆడిటర్‌గా తన ఆందోళనను వ్యక్తం చేస్తున్నది. అంతకాలంగా ఒక అంశంపై ఏకీభవించకుండా ఆడిటర్ కొనసాగడం అసాధారణమని బ్లూంబర్గ్ వ్యాఖ్యానించింది. అకౌంటింగ్ పరిశ్రమను పర్యవేక్షించడానికి 2018లో ఏర్పాటైన ఎన్ఎఫ్ఆర్ఏ వృత్తి ప్రమాణాల్ని, చట్టాల్ని కఠినంగా అమలు చేస్తున్నది. ఆడిటింగ్ పొరపాట్లు కనుగొంటే ఆయా సంస్థలకు జరిమానా విధించడమే కాకుండా డిబార్ కూడా చేస్తుంది. గత ఐదేండ్లలో ఇది 40 మందికిపైగా వృత్తి నిపుణుల్ని డిబార్ చేసింది. ఇప్పటికే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఎల్ అండ్ ఎఫ్ఎస్) అకౌంటింగ్ కుంభకోణం నేపథ్యంలో ఎస్ఆర్ బాట్లిబాయ్‌కి రెగ్యులేటర్ సెగ తగిలింది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఖాతా పుస్తకాల్ని ఆడిట్ చేసిన ఎస్ఆర్ బాట్లిబాయ్ బేసిక్ ఆడిట్ నిబంధనల్ని పాటించలేదంటూ ఆ కంపెనీ ఆడిటర్ పదవి నుంచి తొలగించింది.

ఆకట్టుకున్న గల్ఫ్ ఆయిల్

హైదరాబాద్, అక్టోబర్ 25: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు అందిస్తున్న గల్ఫ్ ఆయిల్ లుబ్రికేంట్స్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.73.63 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఆర్జించిన రూ.52.14 కోట్ల లాభంతో పోలిస్తే 41 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.719.50 కోట్ల నుంచి రూ.802 కోట్లకు ఎగబాకినట్టు వెల్లడించింది. గత త్రైమాసికంలో ఆల్-రౌండ్ పనితీరు కనబరిచినట్టు, విలువ, ఆదాయ, మార్జిన్, లాభాల పరంగా రెండంకెల వృద్ధి నమోదైందని గల్ఫ్ ఆయిల్ ఎండీ, సీఈవో రవి చావ్లా తెలిపారు. ఎబిటా మార్జిన్ రూ.100 కోట్ల దాటడం విశేషమని పేర్కొన్నారు. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా రిటైల్ అవుట్‌లెట్ల సంఖ్యను పెంచుకోవడం వల్లనే ఆర్థిక ఫలితాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని, దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఆశించిన స్థాయిలో వృద్ధిని కనబరిచినట్టు చెప్పారు. మధ్యప్రాచ్యంతో పాటు రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం కొనసాగుతుండటం స్వల్పంగా ప్రభావం చూపే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు.

ప్రైవేట్ బ్యాంకులకు ఆర్బీఐ విజ్ఞప్తి

ముంబై, అక్టోబర్ 25: ప్రైవేట్ బ్యాంకులు కనీసంగా ఇద్దరు హోల్-టైం డైరెక్టర్లను నియమించుకోవాలని రిజర్వు బ్యాంక్ సూచించింది. మేనేజింగ్ డైరెక్టర్‌తోపాటు సీఈవోలు కలుపుకొని కనీసంగా ఇద్దరు నియమించుకోవాలని బుధవారం సెంట్రల్ బ్యాంక్ పేర్కొంది. బ్యాంకింగ్ రంగం సవాళ్లను ఎదుర్కొంటున్నదని, వీటిని అధిగమించాలంటే కనీసం ఇద్దరు హోల్-టైం డైరెక్టర్లను నియమించుకోవాలని ప్రైవేట్ బ్యాంక్‌లను ఆదేశించింది.

మోటోరోలా బెండింగ్ ఫోన్

ఇల్లినాయిస్, అక్టోబర్ 25: ఒకప్పుడు ఫీచర్ ఫోన్.. ఆ తర్వాత స్మార్ట్‌ఫోన్.. ఇప్పుడు ఫోల్డబుల్ ఫోన్.. ఇక బెండింగ్ ఫోన్ వంతు వస్తున్నది. అమెరికన్ బహుళజాతి టెలికమ్యూనికేషన్ దిగ్గజం మోటోరోలా.. ఈ బెండింగ్ ఫోన్‌ను ఆవిష్కరించింది. తమ మాతృ సంస్థ లెనోవా 'టెక్ వరల్డ్ 2023'లో అత్యాధునిక ప్రోటోటైప్ బెండింగ్ స్మార్ట్‌ఫోన్‌ను మోటోరోలా పరిచయం చేసింది. మడత ఫోన్లకు అప్‌డేట్ మోడల్‌గా వస్తున్న ఈ బెండింగ్ ఫోన్లను ఏకంగా చాప చుట్టినట్టు చుట్టేయవచ్చు. చేతికి వాచీ, బ్రేస్‌లెట్‌లాగా కూడా ధరించవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే కష్టమర్లు దీన్ని ఎలా కావాలంటే అలా వాడుకోవచ్చు. నిజానికి 2016 టెక్ వరల్డ్ ఈవెంట్‌లోనే దీన్ని సంస్థ పరిచయం చేసింది. అయితే ఇప్పుడీ ఫోన్‌ను మార్కెట్‌లోకి తొందర్లోనే తెచ్చేందుకు మోటోరోలా సిద్ధమవుతున్నది. అయితే ధర, ఇతరత్రా వివరాలను ప్రకటించాల్సి ఉన్నది.

ఈ ఫోన్ విశేషాలెన్నో..

- ఫుల్ హెచ్‌డీ, పీవోఎల్ఈడీ డిస్‌ప్లే
- 6.9 అంగుళాల స్క్రీన్.. వీలునుబట్టి 4.6 అంగుళాలకు తగ్గించుకునే సౌకర్యం
- ఫ్యాబ్రిక్ మెటీరియల్‌తో ఫోన్ వెనుక వైపు డిజైనింగ్
- ప్రస్తుత మోడల్స్ కంటే మెరుగైన కెమెరా లుంటాయని అంచనా
- స్టోరేజీ, ర్యామ్, బ్యాటరీ సామర్థ్యాలపైనా పెరుగుతున్న ఆసక్తి

ఐదోరోజూ అదే తీరు

భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు

ముంబై, అక్టోబర్ 25: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదోరోజు నష్టపోయాయి. ఆర్థిక, ఐటీ షేర్లలో భారీగా క్రయవిక్రయాలు జరగడంతోపాటు మధ్య తూర్పు దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మదుపరులను అమ్మకాలవైపు నడిపించాయి. ఫలితంగా వరుసగా ఐదోరోజు బుధవారం కూడా సూచీలు ఒక్క శాతం వరకు కోల్పోయాయి. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 522.82 పాయింట్లు నష్టపోయి 64,049.06 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 159.60 పాయింట్లు కోల్పోయి 19,122.15 వద్ద ముగిసింది. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 2,379 పాయింట్లు, నిఫ్టీ 690 పాయింట్లు పతనం చెందాయి.

టాప్ లూజర్‌గా ఇన్ఫోసిస్

దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ షేరు ధర భారీగా నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. కంపెనీ షేరు ధర 2.76 శాతం పతనం చెందింది. భారతీ ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, టాటా మోటర్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, టైటాన్, యాక్సిస్ బ్యాంక్‌లు భారీగా నష్టపోయాయి. కానీ, టాటా స్టీల్, ఎస్బీఐ, మహీంద్రాఅండ్‌మహీంద్రా, మారుతి, నెస్లెలు మాత్రం పెరిగాయి. రంగాలవారీగా చూస్తే టెక్నాలజీ షేరు 1.39 శాతం, టెలికమ్యూనికేషన్ 1.29 శాతం, యుటిలిటీ 1.25 శాతం, ఐటీ 1.13 శాతం, పవర్ 1.09 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్, రియల్టీ, బ్యాంకింగ్ రంగ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించలేదు.

14.60 లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ల భారీ పతనంతో మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోతున్నది. గత ఐదు సెషన్లలో మదుపరులు రూ.14.60 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో దేశీయ బ్లూచిప్ సంస్థల షేర్లలో అమ్మకాలు పోటెత్తాయి. ఫలితంగా ఐదు సెషన్లలో సెన్సెక్స్ 2,379 పాయింట్లు లేదా 3.58 శాతం నష్టపోయింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.14,60,288.82 కోట్లు కోల్పోయి రూ.3,09,22,136.31 కోట్లకు పరిమితమైంది.

టెక్ మహీంద్రా లాభంలో క్షీణత

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన టెక్ మహీంద్రా నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.505.3 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,299.2 కోట్ల లాభంతో పోలిస్తే 61 శాతం క్షీణత కనబరిచింది. కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.13,129.5 కోట్ల నుంచి రూ.12,864 కోట్లకు పడిపోయింది. టెలికం, కమ్యూనికేషన్, ఒప్పందాలు మరింత ఆలస్యం కావడం వల్లనే లాభాలపై ప్రతికూల ప్రభావం చూపిందని టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నానీ తెలిపారు. ఆర్థిక కంపెనీ ఆదాయంలో కమ్యూనికేషన్స్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్(సీఎంఈ) వాటా 40 శాతంగా ఉన్నది. కంపెనీ ఆపరేటింగ్ మార్జిన్ 4.7 శాతంగా ఉండగా, గత త్రైమాసికంలో నమోదైన 6.8 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. గత త్రైమాసికంలో సంస్థ 640 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నది.

రూ.12 మధ్యంతర డివిడెండ్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ ప్రతిషేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. సీఎంఈ నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరకపోవడంతో సంస్థ ఇతర రంగాలపై దృష్టి సారించింది. బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ)తోపాటు హెల్త్‌కేర్ రంగాలపై ప్రధానంగా దృష్టి సారించినట్టు ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కంపెనీ సీఎఫ్‌వో రోహిత్ ఆనంద్ తెలిపారు. డిసెంబర్ 19న కంపెనీ ప్రస్తుత సీఈవో, ఎండీ సీపీ గుర్నానీ పదవీ విరమణ చేయబోతున్నారు. ఈ స్థానంలో మోహిత్ జోషి నియమితులయ్యారు.

యాక్సిస్ బ్యాంక్ లాభం 5,863 కోట్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ యాక్సిస్ బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.5,863 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.5,329 కోట్లతో పోలిస్తే 10 శాతం అధికమని పేర్కొంది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి గత త్రైమాసికంలో బ్యాంక్ రూ.815 కోట్ల నిధులను వెచ్చించింది. ఏడాది క్రితం కేటాయించిన రూ.550 కోట్ల కంటే భారీగా పెరిగాయి. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.24,094 కోట్ల నుంచి రూ.31,660 కోట్లకు పెరిగినట్టు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 19 శాతం ఎగబాకి రూ.12,315 కోట్లకు చేరుకున్నది. ఈ సందర్భంగా యాక్సిస్ బ్యాంక్ ఎండీ, సీఈవో అమితాబ్ చౌదరీ మాట్లాడుతూ..అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మరింత బలోపేతం అవుతున్నదని, అలాగే ప్రస్తుత పండుగ సీజన్‌లో రుణాలకు డిమాండ్ ఉంటుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు ధర స్వల్పంగా తగ్గి రూ.955.35 వద్ద ముగిసింది.

ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు షాక్

రూ.లక్ష కోట్ల జీఎస్టీ నోటీసులు

పన్ను ఎగవేతలపై జారీ చేసిన అధికారులు

అన్యాయమంటున్న సంస్థలు -కోర్టుల్లో న్యాయపోరాటం

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు గట్టి షాకే తగిలింది. ఏకంగా లక్ష కోట్ల రూపాయల విలువైన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నోటీసులు జారీ అయ్యాయి మరి. 'ఇప్పటిదాకా ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు జీఎస్టీ అధికార వర్గాల ద్వారా దాదాపు లక్ష కోట్ల రూపాయల విలువైన నోటీసులు ఇవ్వడం జరిగింది.' అని ఓ సీనియర్ అధికారి బుధవారం తెలియజేశారు. పన్ను ఎగవేతలకుగాను ఈ షోకాజ్ నోటీసులను ఇచ్చామన్నారు. కాగా, ఈ నెల 1 నుంచి దేశంలోకి ఎన్ని విదేశీ గేమింగ్ కంపెనీలు వచ్చాయన్న వివరాలేవీ ఇంకా లేవన్నారు. అక్టోబర్ 1 నుంచి భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించే విదేశీ గేమింగ్ కంపెనీలు దేశంలో నమోదు కావడాన్ని తప్పనిసరి చేస్తూ జీఎస్టీ చట్టంలో కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసిన సంగతి విదితమే.

28 శాతం పన్ను

ఆన్‌లైన్ గేమింగ్ వేదికలపై జరిగే బెట్టింగులకు దాని పూర్తి విలువ ఆధారంగా 28 శాతం జీఎస్టీ వర్తిస్తుందని ఈ ఏడాది ఆగస్టులో మోదీ సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పట్నుంచి జీఎస్టీ షార్ట్ పేమెంట్ కోసం సమాచార నోటీసైనా లేదా షోకాజ్ నోటీసైనా ఏదో ఒకటి గేమింగ్ కంపెనీలు అందుకుంటూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇప్పటిదాకా ఇలా సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన పన్ను ఎగవేత నోటీసులను ఆయా కంపెనీలకు పంపించినట్టు సదరు సీనియర్ అధికారి స్పష్టం చేశారు.

కోర్టుల్లో సవాల్

జీఎస్టీ అధికార వర్గాలు జారీ చేసిన ఈ డిమాండ్ నోటీసులపై ఆయా ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నాయి. నైపుణ్యం ఆధారంగా నడిచే ఈ ఆటలకు 18 శాతం జీఎస్టీని చెల్లిస్తున్నామని హైకోర్టులకు కంపెనీలు ఈ సందర్భంగా వివరిస్తున్నాయి. ఈ క్రమంలోనే తమకు అందిన పన్ను ఎగవేత నోటీసులపై డెల్టా కార్ప్.. బాంబే హైకోర్టులో సవాల్ చేసింది. తాము, తమ అనుబంధ సంస్థలు దాఖలు చేసిన రిట్ పిటీషన్లను హైకోర్ట్ ఆఫ్ బాంబే ఎట్ గోవా సోమవారం పరిశీలించిందని మంగళవారం డెల్టా కార్ప్ పేర్కొన్నది. అలాగే కోర్టుకు తెలియపర్చకుండా జీఎస్టీ అధికారులు ఏ రకమైన తుది నిర్ణయానికి రావద్దని, ఆయా కంపెనీలపై ఎటువంటి చర్యలకు దిగవద్దని కూడా హైకోర్టు స్పష్టం చేసినట్టు డెల్టా కార్ప్ తెలిపింది. మరోవైపు ఓ కంపెనీకి అనుకూలంగా కర్ణాటక హైకోర్టు తీర్పునివ్వడంతో దీన్ని సవాల్ చేస్తూ ఈ ఏడాది జూలైలో కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది.

డ్రీమ్11కు భారీగా..

గేమింగ్ కంపెనీలకు జారీ చేసిన దాదాపు లక్ష కోట్ల రూపాయల పన్ను ఎగవేత నోటీసుల్లో అత్యధికంగా డ్రీమ్11కే వెళ్లడం గమనార్హం. ఈ గేమింగ్ కంపెనీ తమకు రూ.40,000 కోట్ల షోకాజ్ నోటీసులు అందినట్టు ప్రకటించింది. అలాగే డెల్టా కార్ప్ వంటి క్యాసినో ఆపరేటర్లు, గేమింగ్ ప్లాట్‌ఫామ్ ప్రొవైడర్లు.. జీఎస్టీ అథారిటీల నుంచి రెండు విడుతల్లో మొత్తం రూ.23,000 కోట్ల నోటీసులను అందుకున్నారు. ఇక నిరుడు సెప్టెంబర్‌లో గేమ్స్‌క్రాఫ్ట్‌కు జీఎస్టీ ఎగవేసిందని ప్రత్యేకంగా రూ.21,000 కోట్ల షోకాజ్ నోటీసు జారీ అయ్యింది.

ఎయిర్‌పోర్ట్‌లో పెరిగిన జీఎమ్మార్ వాటా

మలేషియా ఎయిర్‌పోర్ట్ 11 శాతం వాటాను కొనుగోలు చేసిన సంస్థ

హైదరాబాద్, అక్టోబర్ 25: హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మలేషియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ వైదొలిగింది. జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో తనకున్న 11 శాతం వాటాను జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్‌కు విక్రయించింది. ఒప్పందం విలువ 100 మిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా(మన కరెన్సీలో రూ.831 కోట్ల కంటే అధికం). మారిషస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన అనుబంధ సంస్థే మలేషియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్. దీంతో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో జీఎమ్మార్ వాటా 63 శాతం నుంచి 74 శాతానికి చేరుకోనున్నది. మిగతా వాటాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి 13 శాతం ఉండగా, ఎయిర్‌పోర్ట్స్ అథార్టీ ఆఫ్ ఇండియా(ఏఏఐ)కి 13 శాతం వాటా ఉన్నది. ఈ వాటా కొనుగోలు ఒప్పందం పూర్తికావడానికి 135 రోజులు పట్టవచ్చని అంచనా. ఈ సందర్భంగా జీఎమ్మార్ గ్రూపు బిజినెస్ చైర్మన్(ఎయిర్‌పోర్ట్స్) జీబీఎస్ రాజు మాట్లాడుతూ..విమానాశ్రయ వ్యాపారంలో తొలి నుంచి వాటాదారుడిగా ఉన్న ఎంఏహెచ్‌బీ వైదొలగడం కొంత బాధగా ఉన్నదని, అయినప్పటికీ ఢిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయ నిర్వహణలో టెక్నికల్‌గా సేవలు అందించనున్నట్టు తెలిపారు. అలాగే జీఎమ్మార్ గ్రూపు కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గంధీ మాట్లాడుతూ..విమానాశ్రయ వ్యాపారాన్ని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో జీహెచ్ఐఏఎల్‌లో అదనపు వాటాను కొనుగోలు చేసినట్టు చెప్పారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు రూ.224.25 కోట్ల విలువైన తుది డివిడెండ్ చెక్‌ను అందజేస్తున్న భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఎండీ భాను ప్రకాశ్ శ్రీవాత్సవ. చిత్రంలో రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్, తదితరులు



ఆతిథ్యరంగం అదుర్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: దేశవ్యాప్తంగా ఆతిథ్య రంగం అంచనాలకు మించి రాణిస్తున్నది. బిజినెస్ ట్రావెల్స్, విదేశీ టూరిస్టులు అత్యధికంగా భారత్‌ను సందర్శిస్తుండటంతో దేశీయ ఆతిథ్య రంగం ఈ ఏడాది రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోనున్నదని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. ఇటీవల జరిగిన జీ20 సమ్మిట్‌తోపాటు ప్రస్తుతం జరుగుతున్న క్రికెట్ ఐసీసీ వరల్డ్ కప్ 2023 కూడా ఆతిథ్య రంగానికి ఊతమిస్తున్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా ప్రీమియం హోటళ్ల అక్యూపెన్సీ రేట్ 70-72 శాతం మేర ఉంటుందని ఇక్రా అంచనావేస్తున్నది. దేశవ్యాప్తంగా సరాసరి ప్రీమియం హోటల్ రూం గది రూ.6,000 నుంచి రూ.6,200 స్థాయిలో ఉన్నది.

విస్తరణ దిశగా ఫాక్స్‌కాన్

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రానిక్ దిగ్గజ సంస్థ ఫాక్స్‌కాన్ (ఫాక్స్‌కాన్ ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ, ఎఫ్ఐటీ) తెలంగాణలో తమ కంపెనీని మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా అదనపు భూమి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. హైదరాబాద్‌లో ఒకేచోట లభ్యంకాకున్నా వేర్వేరు ప్రాంతాల్లోనైనా భూములు తీసుకునేందుకు సంస్థ సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

చైనా నుంచి ఇక్కడికి..

చైనాలో తమ కార్యకలాపాలను పూర్తిగా ఉపసంహరించుకోవాలని నిర్ణయించిన తైవాన్ సంస్థ ఫాక్స్‌కాన్.. క్రమంగా భారత్‌లో తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్న విషయం తెలిసిందే. ఇదివరకే చెన్నైలో మొబైల్ ఫోన్ల తయారీ సంస్థను ఏర్పాటు చేయగా, ఇటీవలే బెంగళూరులో కూడా కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ క్రమంలోనే తెలంగాణలో సైతం ఈ ఏడాది మే నెలలో కొంగరకలాన్‌లో పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టింది. కొంగరకలాన్‌లో సుమారు 196 ఎకరాల్లో ఫాక్స్‌కాన్ రూ.4,562 (550మిలియన్ డాలర్లు)కోట్ల పెట్టుబడితో ప్లాంట్‌ను తెస్తున్నది. ప్రత్యక్షంగా 25వేల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. రాష్ట్ర పారిశ్రామిక అనుకూల, స్నేహపూర్వక విధానాలతో ఫాక్స్‌కాన్ సంస్థ తెలంగాణలో పెట్టుబడి ప్రకటన చేసిన కొద్దిరోజులకే ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని పరిశ్రమ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

అదనపు భూమి కోసం ప్రభుత్వానికి వినతి

యాపిల్ ప్రధాన సరఫరాదారు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్‌కు మెజారిటీ సప్లయర్ ఫాక్స్‌కానే. ఐపాడ్‌లు, వైర్‌లెస్ ఇయర్ ఫోన్ల తయారీకీ ఇటీవలే యాపిల్ నుంచి ఆర్డర్‌ను కూడా అందుకున్నది. ప్రస్తుతం చైనాకు చెందిన కంపెనీలు యాపిల్‌కు వైర్‌లెస్ ఇయర్‌ఫోన్లు, చార్జర్లను సరఫరా చేస్తున్నాయి. అయితే తాజాగా వాటిని సైతం భారత్‌లోనే తయారు చేయించాలని యాపిల్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ కేంద్రంగా ఏర్పాటుచేస్తున్న పరిశ్రమలో సాధ్యమైనంత తొందర్లోనే ఉత్పత్తి ప్రారంభించాలని ఫాక్స్‌కాన్ కంపెనీ సంకల్పించింది. కంపెనీ ప్రణాళికలకు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరిస్తున్నది. ఈ ఏడాది మొదట్లో ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూపు చైర్మన్ యంగ్ లియు హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావుతో సమావేశమై తమ పెట్టుబడి ప్రణాళికలపై చర్చించిన విషయం తెలిసిందే.

KARVY STOCK BROKING

కార్వీ మాజీ ఉద్యోగులకు సెబీ నోటీసులు

15 రోజుల్లో రూ.1.8 కోట్లు చెల్లించాలి

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) ఖాతాదారుల నిధుల్ని దుర్వినియోగం చేసిన కేసులో ముగ్గురు మాజీ ఉద్యోగులకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ డిమాండ్ నోటీసులు జారీచేసింది.15 రోజుల్లో రూ.1.80 కోట్లు చెల్లించాలని, లేదంటే అరెస్టు, బ్యాంక్ ఖాతాలు, ఆస్తుల జప్తు తదితర చర్యల్ని చేపట్టనున్నట్టు సెబీ హెచ్చరించింది. కేఎస్‌బీఎల్ మాజీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ హరి, మాజీ కాంప్లియెన్స్ ఆఫీసర్ శ్రీకృష్ణ గురజాడ, బ్యాక్ ఆఫీస్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరాజులకు గతంలో విధించిన జరిమానాను చెల్లించకపోవడంతో తాజాగా ఈ డిమాండ్ నోటీసుల్ని జారీచేసింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.